క్లుప్తంగా

బహిరంగ వేలం వాయిదా

నందిగామటౌన్: మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో గురువారం నిర్వహించాల్సిన టెండర్ కం బహిరంగ వేలం పాటలు వాయిదా వేసినట్లు ఈఓ హరిగోపీనాథ్ తెలిపారు. ఆయా హక్కుల వేలంలో పాల్గొనేందుకు పాటదారులు ఆసక్తిచూపకపోవడంతో వేలంను వాయిదా వేసినట్లు ఈఓ వివరించారు.

ఆటోడ్రైవర్‌కు తీవ్రగాయాలు



లింగాల(వత్సవాయి): ఆటో, కారు ఢీకొనడంతో ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడిన సంఘటను గురువారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు పెనుగంచిప్రోలు మండలం లింగగూడెం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ పుల్లయ్య తన వాహనంలో ప్రయాణికులను తీసుకుని బోనకల్లు వెళ్తుండగా, లింగాల ఎంపీయూపీ పాఠశాల సమీపంలోని ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి కారును ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ పుల్లయ్య తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంలో ఆటో కూడా దెబ్బతింది. ఈ ఘటనపై ఎస్‌ఐ పి.ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేశారు.

కళ్యాణ వెంకటేశ్వరునికి పంచామృతాభిషేకం



నందిగామటౌన్: మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి జన్మనక్షత్ర పూజలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మ, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు వైఖానస సంప్రదాయం ప్రకారం అలివేలు మంగ, పద్మావతి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి వారికి సుగంధ ద్రవ్యాలతో పంచామృతాభిషేకాలు, అష్టోత్తర సహస్ర నామ పూజలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి 'కోహెన్స్' కృషి



ముక్త్యాల(జగ్గయ్యపేట): మండలంలోని ముక్త్యాల గ్రామాభివృద్ధికి కోహెన్స్ లైఫ్ సైన్సెస్ యాజమాన్యం తమ వంతు కృషి చేస్తోందని ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ మురళీధర్ తెలిపారు. కోహెన్స్ లైఫ్ సైన్సెస్ యాజమాన్యం తమ సీఎస్‌ఆర్ నిధుల ద్వారా గ్రామానికి గురువారం అంబులెన్స్‌ను అందించింది. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ యాజమాన్యం తరపున తమవంతుగా గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో గ్రామానికి చెందిన వారికి ఆస్పత్రులకు తరలించేందుకు వీలుగా అంబులెన్స్‌ను అందజేసినట్లు వివరించారు. అనంతరం సచివాలయ పారిశుద్ధ్య కార్మికులకు భద్రతా పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్ అస్మతున్, టీడీపీ నాయకులు శ్రీరాం చిన్నబాబు, హెచ్‌ఆర్ మేనేజర్ వెంకట్రావ్, ఎస్‌ఐ తోట సూర్యశ్రీనివాస్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తలంబ్రాలు బియ్యం కలిపేందుకు ఆహ్వానం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి కల్యాణ మహోత్సవం ఫిబ్రవరి 11న రాత్రి 9.32 గంటలకు జరగనుందని ఆలయ ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీగోపయ్య సమేత శ్రీతిరుపతమ్మవారి కల్యాణ మహోత్సవం సందర్భంగా ముత్తయిదువులతో ఫిబ్రవరి 3న ఉదయం10.30 గంటలకు ఆలయంలో తలంబ్రాల బియ్యం కలిపే కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆసక్తి కలిగిన భక్తులు పాల్గొనాలని ఈఓ కోరారు.

మొక్కలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

జగ్గయ్యపేట అర్బన్: ఊరచెరువు పార్కులో 40మొక్కలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ జనసేన నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావును కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ కొలగాని రాము తదితరులు ఉన్నారు.

అర్ధరాత్రి ఇసుక అక్రమ రవాణా

- ఎంపీ, ఎమ్మెల్యే కనుసన్నల్లోనే ఇసుక దందా
- ఇందుగపల్లి క్వారీ నుంచి రాత్రివేళల్లో తెలంగాణకు తరలింపు
- నిబంధనలకు తూట్లు
- ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం
- క్వారీ వైపు కన్నెత్తి చూడలేని స్థితిలో అధికారులు



ఇందుగపల్లి నుంచి రాత్రివేళ అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుబడిన టిప్పర్లు

ఇందుగపల్లి(వత్సవాయి): కూటమి నాయకులు ఉచితం మాటున ఇసుకను యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తున్నారు.అందరికీ ఉచిత ఇసుక హామీ..ఆచరణలో కూటమి నాయకులకు కాసులు కురిపిస్తోంది. పగటిపూట మాత్రమే ఇసుక లోడింగ్ చేయాలని, లోడింగ్‌కు యంత్రాలను వినియోగించరాదన్న నిబంధనలను తోసిరాజంటూ చీకటి పడగానే కూటమి నాయకులు ఇసుకదందాకు తెరతీస్తున్నారు. ఇందుకు ఇందుగపల్లి క్వారీలో యథేచ్ఛగా సాగుతున్న ఇసుక అక్రమరవాణాయే నిదర్శనం. పాలకుల అధికారానికి భయపడి రెవెన్యూ, మైనింగ్‌శాఖల అధికారులు ఇసుక క్వారీ వైపు కన్నెత్తి చూడలేని పరిస్థితి నెలకొంది. ఈ ఇసుక అక్రమరవాణా విషయాన్ని రెవెన్యూ అధికారుల వద్ద ప్రస్తావిస్తే..క్వారీలో యంత్రాలను ఏర్పాటు చేయడం, రాత్రివేళల్లో ఇసుకను తరలిస్తున్న వైనం ఇప్పటివరకు మాదృష్టికి రాలేదని చెబుతుండటం గమనార్హం.

ప్రజలకు క్వారీలోకి నో ఎంట్రీ...

వత్సవాయి మండలంలోని ఇందుగపల్లి ఇసుక క్వారీ నుంచి ప్రజలు ఇసుకను ఉచితంగా తరలించుకునేందుకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. అయితే ఈ క్వారీ నుంచి ఇసుక తరలింపు పేదలకు పెద్ద తలనొప్పిగా మారింది. క్వారీపై అధికారపార్టీ నాయకులు పెత్తనం చేస్తుండటమే ఇందుకు కారణం.

పేదలు తమ గృహావసరాల కోసం ఇసుకను తరలించుకునేందుకు ట్రాక్టర్లతో క్వారీల వద్దకు వెళితే క్వారీలో ఉన్న నాసిరకం ఇసుకనే ట్రాక్టర్లకు నింపుకోవాలంటూ అక్కడ ఉంటున్న కూటమి నాయకులు హుకుం జారీచేస్తున్నారు. ఈ ఇసుక గృహావసరాలకు పనికిరాదు లోపలికి వెళ్లి ట్రాక్టర్‌కు నింపుకుంటామని అడిగితే అలా వీల్లేదు మీరు క్వారీ లోపలికి వెళ్లడానికి వీలులేదంటూ కూటమి నాయకుల అనుచరులు అడ్డుకుంటున్నారు. ఇష్టం ఉంటే ఇక్కడ ఇసుక నింపుకోండి...లేకుంటే వెళ్లిపోండి అంటూ వారు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని పలువురు ప్రజలు వాపోతున్నారు. ఈవిషయంపై అధికారులను ప్రశ్నించినా వారి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో చేసేదిలేక ఎవరికీ చెప్పుకోవాలో తెలియడం లేదని జనం వాపోతున్నారు .

యథేచ్ఛగా తెలంగాణకు రవాణా...

ఇందుగపల్లి క్వారీ నుంచి ఇసుక యథేచ్ఛగా తెలంగాణకు తరలిపోతోంది. క్వారీలో పొక్లెయిన్, జేసీబీలు ఏర్పాటు చేసి రాత్రివేళల్లో లారీలు, టిప్పర్లకు ఇసుకును నింపి తెలంగాణకు తరలిస్తున్నారు.

ఇందుగపల్లి క్వారీ నుంచి తెలంగాణ సరిహద్దు కేవలం పది కిలోమీటర్లలోపే ఉండటంతో ఇసుక అక్రమరవాణాదారులకు అడ్డూ అదుపులేకుండా పోయింది. యంత్రాలతో లోడింగ్ చేసుకునేందుకు అనుమతులు లేకున్నా ఈ విషయంపై ప్రశ్నించేందుకు అధికారులు జంకుతున్నారు. దీంతో క్వారీలో పరిస్థితి కూటమి నాయకులు, వారి అనుచరులు ఆడిందే ఆట..పాడిందే పాటలా సాగుతోంది.

టిప్పర్లను అడ్డుకున్న తన్నీరు..

ఇందుగపల్లి క్వారీ నుంచి అర్ధరాత్రి అక్రమంగా ఇసుకను తెలంగాణాకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు రెండురోజుల కిందట వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు స్థానికులతో ఇసుక కార్వీని సందర్శించారు. రాత్రివేళ క్వారీ నుంచి ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకుని, సమాచారాన్ని అధికారులకు తెలియజేశారు. ఎంపీ, ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే ఈ ఇసుక అక్రమరవాణా దందా సాగుతోందని తన్నీరు నాగేశ్వరరావు ఆరోపించడం గమనార్హం. ఇకనైనా రెవెన్యూ, మైనింగ్‌శాఖల ఉన్నతాధికారులు స్పందించి ఈ ఇసుక అక్రమరవాణా దందాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



అక్రమ ఇసుకరవాణాను అడ్డుకుంటున్న తన్నీరు నాగేశ్వరరావు

చర్యలు తీసుకుంటాం..

క్వారీ లోపల నుంచి ఎటువంటి యంత్రాలను ఉపయోగించి ఇసుకను లోడింగ్ చేయడానికి అనుమతులు లేవు. ఈ విషయం ఇప్పటివరకు మా దృష్టికి రాలేదు. వెంటనే తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం. రాత్రివేళల్లో ఇసుక తరలిస్తే కేసు నమోదు చేయడంతోపాటు ఆయా వాహనాలను సీజ్ చేస్తాం.

ప్రభుకుమార్, తహసీల్దార్, వత్సవాయి

హైవే బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురండి

ఆర్టీసీ ఆర్‌ఎంకు తన్నీరు వినతి



ఆర్టీసీ ఆర్‌ఎం దానంకు వినతిపత్రం అందజేస్తున్న తన్నీరు నాగేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: నిరుపయోగంగా ఉన్న జగ్గయ్యపేట హైవే బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి ప్రయాణికులను సౌకర్యంగా ఉండేలా చూడాలని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు కోరారు. ఈసందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు గురువారం విజయవాడలో ఆర్‌టీసీ ఆర్‌ఎం ఎంవై. దానంను కలిసి వినతిపత్రం అందజేశారు. తన్నీరు మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణానికి అనుబంధంగా జాతీయ రహదారిపై ఆటోనగర్ పక్కన ఏడాది కిందట హైవే బస్టాండ్‌ను రూ.1.20 కోట్లతో నిర్మించి ప్రారంభించారని, ఈ బస్టాండ్‌ను వినియోగం వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని ఆర్‌ఎంను కోరారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లేవారికి సౌకర్యంగా ఉండేందుకు నిర్మించిన ఈ బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందన్నారు. బస్టాండ్‌లోకి బస్సులు రాకపోతుండటంతో ప్రయాణికులు హైవే పైనే బస్సులు ఎక్కాల్సి వస్తోందన్నారు. దీంతో ప్రయాణికులు అవస్థలుపడుతున్నారన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని హైవే బస్టాండ్‌ను వినియోగంలోకి వచ్చేలా చూడాలని ఆయన ఆర్‌ఎంను కోరారు.

కుక్కలకు చర్మవ్యాధులు.. భయపడుతున్న ప్రజలు

- కుక్కల చర్మం ఊడిపోయి పుండ్లు
- సంక్రమిస్తాయేమోనని హడలిపోతున్న ప్రజలు



చర్మ వ్యాధులు సోకిన కుక్క

పెనుగంచిప్రోలు: ఇటీవలన పెద్ద సంఖ్యలో కుక్కలు గ్రామాల్లో భయంకరంగా కనిపిస్తున్నాయి. అన్ని గ్రామాల్లో పదుల సంఖ్యలో కుక్కల చర్మం అంతా ఊడిపోయి పుండ్లు పడి బక్కగా తగ్గిపోతున్నాయి. దురదతో అవి అల్లాడుతున్నాయి. చర్మవ్యాధులు వచ్చిన కుక్కలు బక్కగా తయారై క్షీణించి పోయి మరణిస్తున్నాయని ప్రజలు అంటున్నారు. వీటికి పుట్టిన పిల్లలు చనిపోతున్నాయని తెలుపుతున్నారు. అయితే వీటివలన మనుషులకు ఏమైనా వ్యాధులు వస్తాయేమో అని ప్రజలు హడలి పోతున్నారు. వీటిని చూస్తేనే పరిగెత్తే పరిస్థితి వస్తోంది. మండలంతో పాటు నియోజకవర్గంలో ఏ గ్రామంలో చూసినా పరిస్థితి ఇలానే ఉండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

ఇది చర్మవ్యాధి..



కుక్కలలో ఈ పరిస్థితికి మేంజ్ అనే చర్మవ్యాధి కారణం. కుక్కల్లో ఇది అంటు వ్యాధి. ఒక కుక్క నుంచి మరో కుక్కకు ఇది సోకుతుంది. మనుషులకు దీనివలన ఎటువంటి ప్రమాదం ఉండదు. చర్మం లోపల పురుగు ఉంటుంది. దీనివలన చర్మం ఊడిపోయి పుండ్లు పడతాయి. ఈపురుగులు మైక్రోస్కోప్‌లో మాత్రమే కనపడతాయి. పెంచుకునే కుక్కలకు డీవార్మింగ్ మందులతో పాటు ఇతర మందులు వాడటం వలన చర్మవ్యాధులు పెద్దగా రావు. ఒక వేళ వస్తే ఇన్వర్‌మెక్టిన్ ఇంజెక్షన్‌తో పాటు ఫంగస్ రాకుండా టాబ్లెట్స్ వాడుకోవాలి.

– అనిల్, పశువైద్యాధికారి

న్యాయవాదుల నిరసన




పేటలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. జగ్గయ్యపేట న్యాయవాది బెజవాడ బిక్షమయ్యపై పోలీసుల అక్రమ చర్యలను ఖండిస్తూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు ఎదురుగా ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ పోలీసుల అక్రమ చర్యలను తూర్పారబట్టారు. కార్యక్రమంలో న్యాయవాదులు యలమంచి రాజేంద్రప్రసాద్, ఆరేపల్లి వెంకటేశ్వర్లు, ఎం.ఆంజనేయులు, బసవయ్య, పూల నాగరాజు, వి.మధు, రావూరి ప్రసాద్, కిషోర్, నరేష్, చిన్న గాంధీ, రాజశేఖర్, వెంకట గురువులు, రవి, రాజు, రావూరి ప్రసాద్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

తుది మెరుగులు దిద్దుకుంటున్న యాగశాల




యాగశాల చుట్టూ నిర్మిస్తున్న షెడ్డు



షెడ్డు నిర్మాణానికి అవసరమైన సామగ్రి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నూతన యాగశాల తుది మెరుగులు దిద్దుకుంటోంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాధాకృష్ణుల విగ్రహం వద్ద సుమారు రూ.5 కోట్లతో దాత సంగా నరసింహారావు యాగశాలను నిర్మాణం చేపట్టారు. ఈ యాగశాల ప్రారంభోత్సవం సైతం జరిగింది. విశేష పర్వదినాల్లో చండీహోమానికి అత్యధిక సంఖ్యలో ఉభయదాతలు తరలివస్తుండటం, ప్రస్తుత అవసరాలకు యాగశాల సద్వినియోగం అవుతోంది. భవిష్యత్తులో ఉభయదాతల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో యాగశాల చుట్టూ ఉన్న ప్రదేశాన్ని అభివృద్ధి చేయాలని దేవస్థానం నిర్ణయించింది. ఈ మేరకు యాగశాల చుట్టూ ఆరు అడుగుల మేర ఉన్న మట్టి, కొండ రాళ్లను తొలగించి అభివృద్ధి చేశారు. ఈ ప్రాంతంలో షెడ్డు నిర్మాణం జరుగుతోంది. ఇప్పటికే షెడ్డు నిర్మాణానికి అవసరమైన సామగ్రిని భారీ క్రేన్ సాయంతో యాగశాల పరిసరాలకు తరలించారు. ఈ పనులు పూర్తయిన పిమ్మట మాఘమాసం నుంచి నూతన యాగశాలలో హోమాలు నిర్వహించేందుకు వైదిక కమిటీ కృషి చేస్తోందని సమాచారం.

రాజశ్యామల అలంకారంలో కాళీమాత



కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో మాఘ మాసాన్ని పురస్కరించుకుని రాజశ్యామల నవరాత్రులు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కాళీమాత అమ్మవారు రాజశ్యామల అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు మొదటిరోజు అమ్మవారికి అభిషేకం, గణపతి పూజ, మండపారాధన, నవగ్రహాల హోమం, లక్ష్మీ గణపతి హోమం, మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి హోమం, వీరాంజనేయస్వామి హోమం, రాజశ్యామల హోమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రార్యక్రమాలను ఆలయ అధ్యక్ష కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్ కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు బీహెచ్ విజయకిరణ్ పర్యవేక్షించారు.

- 5 నుంచి స్పోకెన్ ఇంగ్లిషు క్లాసులు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): గవర్నర్‌పేట లోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఫిబ్రవరి ఐదో తేదీ నుంచి స్పోకెన్ ఇంగ్లిషు క్లాసులను ప్రారంభిస్తున్నట్లు ఈ కేంద్రం మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు టి.క్రాంతికిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఆపైన చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తికలవారు రాఘవయ్య పార్కు సమీపం లోని కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

గాంధీజీ మార్గం నేటి తరానికి ఆచరణీయం



నందిగామలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు



పేటలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

నందిగామటౌన్: మహాత్మాగాంధీ చూపిన శాంతియుత మార్గం పాలకులు, ప్రజలకు ఆచరణీయమని నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం మహాత్మాగాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు దేశ స్వాతంత్ర్య సంగ్రామాన్ని, మహాత్మాగాంధీ జీవితాన్ని విడదీసి చూడలేమన్నారు. మహాత్మాగాంధీ భరతమాత తలరాతను మార్చిన విధాత అని కొనియాడారు. సత్యం, అహింస అనే ఆయుధాలతో ప్రపంచానికి కొత్త మార్గాన్ని చూపిన మహాత్ముడని కొనియాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గాంధీజీ సిద్ధాంతాలకు అనుగుణంగా పాలన సాగించారని గుర్తుచేశారు. గాంధీజీకి నివాళులర్పించిన వారిలో ఆపార్టీ నాయకులు మువ్వల శ్రీను, షేక్ యాకుబ్ అలీ, ఓర్సు జ్వాలా, మన్నెం దాసు, బండి మురళి, అనుమోలు వాసు, కార్యకర్తలు ఉన్నారు.



పెనుగంచిప్రోలు: గాంధీజీకి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గాంధీ తదితరులు

ఎంపీడీవో కార్యాలయంలో..

నందిగామ మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ ఆకుల హనుమంతరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

ఆర్యవైశ్య సంఘం, వాసవి సిల్వర్ స్టార్ క్లబ్, పలు స్వచ్ఛందధ సంస్థల ఆధ్వర్యంలో నందిగామలో గురువారం గాంధీజీ వర్ధంతిని నిర్వహించారు. గాంధీ విగ్రహానికి, చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చవటి నాగేశ్వరరావు, పబ్బతి సీతారాం గుప్తా, మహంకాళి చంద్రశేఖర్, పులిపాటి వెంకటేశ్వరరావు, మారం వెంకటేశ్వరరావు, కొప్పు జనార్దన్, కేతేపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం కోసం అందరూ కృషిచేయాలని మండల పరిషత్ అధ్యక్షులు మార్కపూడి గాంధీ పిలుపునిచ్చారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గాంధీ మాట్లాడుతూ గ్రామస్వరాజ్య స్థాపనే ధ్యేయగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో గ్రామసచివాలయాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారని వివరించారు. నేడు ఆ సచివాలయాల ద్వారానే ప్రజలకు మేలైన సేవలు అందుతున్నాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలలో...

స్థానిక జెడ్పీ పాఠశాలలో గాంధీజీ వర్ధంతిని ఘనంగా నివాళులర్పించారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు హెచ్ఎం జలజ బహుమతులను అందజేసి అభినందించారు. నేటియువత గాంధీజీని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని గురువారం మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వత్సవాయిలోని గాంధీ పార్కు సెంటర్‌లో ఉన్న జాతిపిత విగ్రహానికి మండల జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బొగ్గవరపు రాజారావు పూలమాలవేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చిరుమామిళ్ల హనుమంతురావు, సీఐటీయు మండల కార్యదర్శి బి.రాము తదితరులు పాల్గొన్నారు.



వత్సవాయిలో నివాళులర్పిస్తున్న వెంకటరాజారావు తదితరులు

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేటఅర్బన్: గాంధీజీ ఆశయ సాధనలో ముందుకు సాగుదామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని గాంధీజీ విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ గాంధీ కన్న కలలు గ్రామ స్వరాజ్యం సాకారం చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాల వ్యవస్థను ఏర్పాటుచేసి ప్రజల వద్దకు పాలనను తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ మాట్లాడుతూ గాంధీజీ ఆచరించిన మార్గాన్ని నేటియువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బూడిద నరసింహారావు, జిల్లా కార్యదర్శులు షేక్ జుబేర్, వేముల మల్లేశ్వరరావు, మాజీ ఎంపీపీ పెంటి శ్రీనివాసరావు, సర్పంచ్ సూరిబాబు, న్యాయవాది సత్యశ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు బద్దూనాయక్, శామ్యూల్ కన్నమాల, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు పింగళి నర్సింహారావు, మన్నె అప్పారావు, బలుసుపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు శీలం ప్రభాకర్, నాయకులు జవ్వాజి నరసింహారావు, గోగుల వెంకయ్య, గంగోలు వినోద్, గొట్టిపాళ్ల సురేష్, దర్శి గోపికృష్ణ, దేవరకొట్టి అంజి, జంగాల వాసు, ఖాదర్ పాల్గొన్నారు.



పేటలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

కూటమి నాయకుల నివాళి..

మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని బంగారుకొట్ల సెంటర్‌లో ఉన్న గాంధీజీ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళుల రి ్పించారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మేకా వెంకటేశ్వర్లు, నాయకులు షేక్ ఖాసిం, మీసాల రాజా, శివరాత్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక విజయవాడ రోడ్‌లోని జనసేన కార్యాలయంలో గాంధీజీ వర్ధంతిని నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ కొలగాని రాము, నాయకులు కాశి కిషోర్, షేక్ సత్తార్, ఆవాల భవానీప్రసాద్, చిన్ని దుర్గారావు, కాకర్ల లక్ష్మీనారాయణ, బాలకోటి, అల్లా భక్షు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

మహాత్మాగాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని గాంధీజీ విగ్రహానికి ఆపార్టీ పట్టణ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాచేపల్లి వీరభద్రరావు, బ్లాక్-1 అధ్యక్షుడు సన్నె రామారావు, రేపూరి శ్రీను, సిమ్మసర్తి శ్రీనివాసరావు, ఎస్‌డీ ఖాజా ఉన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల: సహాయ నిరాకరణ, సత్యాగ్రహం, అహింస అనే ఆయుధాలతో బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి దేశానికి స్వాతంత్ర్యం అందించిన జాతిపితను దేశ ప్రజలు ఎన్నిటికి మర్చిపోరని ఆర్యవైశ్య సంఘ నాయకుడు జూలూరు విశ్వనాథం అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక పెద్దబజార్ గాంధీసెంటర్‌లో గాంధీజీ విగ్రహానికి, పొట్టి శ్రీరాములు విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గాంధీజీకి నివాళులర్పించినవారిలో ఆర్యవైశ్య సంఘ నాయకులు, వాసవి యువసేన నాయకులు జల్లా శ్రీనివాసరావు, ఊటుకూరు కుమార్, పెరుమాళ్ యశ్వంత్, సత్యం, మనోజ్, కృష్ణ తదితరులు ఉన్నారు.



కంచికచర్లలో గాంధీజీ నివాళులర్పిస్తున్న ఆర్య వైశ్య సంఘ నాయకులు విశ్వనాథం తదితరులు